సాక్షి
కామారెడ్డి
గురువారం । 10 । ఆగస్టు । 2023



మంచి పాలనే లక్ష్యం

ప్రజలకు మంచి పాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 8లో ▸



అన్ని వర్గాలకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /22.6

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎంపీ పాటిల్



సాక్షి, కామారెడ్డి: ఎంపీ బీబీ పాటిల్ బుధవారం ఢిల్లీలో జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్‌ను కలిశారు. రాష్ట్రంలోని బీసీలకు సంబంధించిన 40 కుల సంఘాలతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని ఆయనకు వినతి పత్రం అందించారు. తెలంగాణలోని వెనకబడిన తరగతులను వెంటనే జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్



మద్నూర్: జుక్కల్ నియోజకవర్గంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ చేయిస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తెలిపారు. మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో బుధవారం 85 మంది కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా తెరవడం కోసం రూ. 200, బీమా కోసం రూ. 399 అందిస్తానన్నారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ఇంకా 42 మంది కార్మికులకు బీమా చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు తమ్మెవార్ అజయ్, యాదవ్‌రావ్, వెంకట్‌కాలే, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె విరమణ



కామారెడ్డి టౌన్: సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ వెంకట్‌గౌడ్ తెలిపారు. బుధవారం జీపీ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో డీపీవోను కలిసి సమ్మె విరమిస్తున్నట్లు లేఖను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లను 15 రోజులలోగా ప్రభుత్వం పరిశీలించకపోతే మళ్లీ ఉద్యమాలకు సిద్ధం అవుతామన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు ఖలీల్, రాజనర్సు, రాజన్న, శ్యాంకుమార్, మల్లేశ్, నరసయ్య, రవి, సంతోష్, ప్రసాద్, లక్ష్మీ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాలు

కామారెడ్డి అర్బన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడానికి పోస్టాఫీసులో లాభాపేక్షలేకుండా రూ.25కే నాణ్యమైన జాతీయ జెండాలు విక్రయిస్తున్నట్టు కామారెడ్డి హెడ్ పోస్టుమాస్టర్ రాజు తెలిపారు. బుధవారం పోస్టాఫీసు ఆవరణలో హర్ ఘర్ తిరంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్ చేయవచ్చని సూచించారు.

ఓపీఎస్ కోసం 12న చలో హైదరాబాద్

కామారెడ్డిఅర్బన్: ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర బాధ్యులు తగిరంచ నర్సింహారెడ్డి కోరారు. కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులను కోరారు.

మున్సిపాలిటీలకు నిధులు

నిజామాబాద్ నాగారం : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రభుత్వం రూ. 629.70 కోట్ల నిధులు మంజూరు చేసింది. బాన్సువాడకు రూ.50 కోట్లు, కామారెడ్డికి రూ. 60 కోట్లు, ఎల్లారెడ్డికి రూ. 25 కోట్లు, భీమ్‌గల్‌కు రూ. 35 కోట్లు, ఆర్మూర్‌కు రూ. 100 కోట్లు, బోధన్‌కు రూ. 50 కోట్లు, నిజామాబాద్ మున్సిపాలిటీకి 149.65 కోట్లు, నిజామాబాద్ సేవరేజ్ ప్యాకేజ్ కింద రూ. 160.05 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఆయా బల్దియాల్లో పట్టణప్రగతి కింద మరో రూ. 1,751.87 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

అప్పిచ్చినోళ్లకు కుచ్చుటోపి

- వ్యాపార అవసరాల పేరుతో రుణాలు
- రూ. కోట్లు జమ చేసి పారిపోతున్న మోసగాళ్లు
- ఏటేటా పెరుగుతున్న మోసాలు



సాక్షి, కామారెడ్డి : జిల్లాలో మోసాలు పెరిగిపోతున్నాయి. వ్యాపారాల పేరుతో అప్పులు తీసుకోవడం తర్వాత అప్పిచ్చినవారికి కుచ్చు టోపి పెట్టి పరారవడం వంటి సంఘటనలు సాధారణమయ్యాయి. దీంతో నమ్మి అప్పులు ఇచ్చినవారు నిండా మునగాల్సి వస్తోంది. తాజాగా జిల్లాకేంద్రంలో అల్లం వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారి రూ. 2 కోట్లతో ఉడాయించడంతో అతడికి అప్పులు ఇచ్చినవారు లబోదిబోమంటున్నారు.

ఫైనాన్స్, చిట్టీల దందాకు పెట్టింది పేరైన కామారెడ్డి పట్టణంలో కొందరి మూలంగా చాలా ఫైనాన్స్‌లు దివాలా తీశాయి. ఫైనాన్స్‌లు నిర్వహించిన మేనేజర్లే రూ.కోట్లల్లో మింగేయడంతో భాగస్వాములు రోడ్డున పడ్డారు. మోసం చేయాలనుకున్న వారు అందరినీ నమ్మించి ఆస్తులు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పి రూ. కోట్లు వసూలు చేసి పారిపోతున్నారు. గతంలో పలువురు ఐపీ పేరుతో అప్పులిచ్చిన వారికి టోపీ పెట్టి.. ఇప్పుడు దర్జాగా తిరుగుతున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో ఓ టిఫిన్ సెంటర్, స్వీట్ హోం నిర్వహించిన ఉత్తరాదికి చెందిన యువకుడు స్థానికంగా పలువురు వ్యాపారులను నమ్మించి వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. దందా అంతంతమాత్రంగానే నడిచింది. ఇంకేముంది రాత్రికి రాత్రే బిచాణా ఎత్తేశాడు. ఈ సంఘటన మరవక ముందే పట్టణంలోని డెయిలీ మార్కెట్‌లో మహారాష్ట్ర నుంచి వలస వచ్చి అల్లం వ్యాపారం నిర్వహించిన ఓ వ్యాపారి.. పలువురి వద్ద దాదాపు రూ. 2 కోట్ల మేర అప్పులు చేసి ఉడాయించాడు. దీంతో అప్పులిచ్చిన వాళ్లు ఆందోళన చెందుతున్నారు.

బోర్డులు తిప్పేస్తున్న చిట్‌ఫండ్ సంస్థలు..

చిట్స్ అండ్ రిజిస్ట్రార్ నుంచి అన్ని అనుమతులు ఉన్నాయంటూ చిట్స్, ఫైనాన్స్‌లు ఏర్పాటు చేసిన వాళ్లు కూడా బోర్డులు తిప్పేస్తున్నారు. పట్టణంలోని పాత జాతీయ రహదారిపై కొత్త బస్టాండ్ నుంచి మొదలుకొంటే హౌసింగ్ బోర్డు కాలనీ వరకు ఇరవైకిపైగా ఫైనాన్స్ సంస్థల బోర్డులు కనిపించేవి. ఇటీవలి కాలంలో కొన్ని ఫైనాన్స్‌లు రాత్రికి రాత్రే మూతబడ్డాయి. దీంతో చిట్టీలు తీసుకున్న వారు చీటీ డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు నాలుగైదు జిల్లాల్లో చిట్స్, ఫైనాన్స్‌లు నెలకొల్పిన కామారెడ్డి పట్టణానికి చెందిన ఒకరు చాలామంది సభ్యులకు చీటీ డబ్బులు ఇవ్వకుండా రోజుల తరబడిగా తిప్పుకుంటున్నారు. ఇంటికి వెళ్తే ఆయన కుటుంబ సభ్యులు ఎదురు దాడికి దిగుతున్నారు. చీటీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్న చిట్‌ఫండ్ నిర్వాహకులపై, అలాగే అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నమ్మించి ముంచేస్తూ..

జిల్లా కేంద్రంలో దివాలా, బిచాణా ఎత్తేస్తున్న సంఘటనలు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. నమ్మినోళ్లను ముంచేసి పరారవుతున్నారు. కొందరు నష్టపోయామంటూ ఐపీ పెడుతున్నారు. మరికొందరు ఇవ్వాల్సిన వారు ఇవ్వడం లేదని, రికవరీ అయినపుడు అప్పు కడతామంటూ మెలిక పెడుతున్నారు. ఫైనాన్స్, చిట్స్ దందాల్లో మోసాలతో చాలామంది ఆర్థికంగా చితికిపోయారు. నాలుగు డబ్బులు సంపాదించొచ్చన్న ఆశతో ఫైనాన్స్‌లో పెట్టుబడిపెడితే అసలు కూడా నష్టపోయిన వారు ఎందరో ఉన్నారు. ఓ అధ్యాపకుడు ఉద్యోగ విరమణ చేయగా వచ్చిన డబ్బులను తెలిసిన ఓ చిట్టీల వ్యాపారికి అప్పుగా ఇస్తే నిలువునా ముంచాడు. మరో రిటైర్డ్ ఉపాధ్యాయుడు దాచుకున్న డబ్బులను మరో ఫైనాన్స్ వ్యాపారికి తక్కువ వడ్డీకి ఇచ్చాడు. కొంతకాలం వడ్డీ సక్రమంగానే ఇచ్చి తరువాత చేతులెత్తేశాడు. చివరికి నలుగురు కూర్చుండి మాట్లాడితే 40 శాతం అసలు డబ్బులు చేతికి అందాయి.

నగరం మారుపేరు అభివృద్ధి



రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు, మేయర్

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నగర పాలక సంస్థ భవనం
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌ను మించిన రఘునాథ చెరువు
- మహాప్రస్థానం కంటే మెరుగైన వైకుంఠధామాలు
- కితాబిచ్చిన పురపాలక, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందని పురపాలక, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ కితాబునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఇలా మాట్లాడారు.

✤ కార్పొరేషన్ కార్యాలయంలో కొత్త భవనాన్ని రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా నిర్మించారు.

✤ వైకుంఠ ధామాలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానం కంటే మెరుగ్గా నిర్మించారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సొంత ఇంటిపనిలాగా ప్రత్యేక దృష్టి సారించారు.

✤ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌కంటే నిజామాబాద్‌లోని రఘునాథ చెరువును ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. నగరంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ, సమీకృత మార్కెట్ సముదాయాలు, కళాభారతి కేంద్రం వంటివి అభివృద్ధికి నిదర్శనాలు.

✤ కార్మికులతో సహపంక్తి భోజనం చేసేటప్పుడు లావణ్య, యాదమ్మలతో మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉందని అడిగా. ఎమ్మెల్యే చాలా అద్భుతంగా పనిచేస్తున్నాడని, అందరినీ ఆదుకుంటున్నాడని చెప్పడం సంతోషంగా ఉంది.

డివిజన్‌కు కోటి రూపాయలు..

అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా తన నియోజకవర్గ అభివృద్ధికి ఏదైనా సహాయం చేయాలని కోరగా.. స్పందించిన కేటీఆర్ 60 డివిజన్లకు ఒక్కో డివిజన్‌కు రూ.కోటి చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్బన్ మరింత అభివృద్ధి చెందాలని, వచ్చే ఎన్నికల్లో బిగాలను 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్సీ కవిత గైర్హాజరుపై..

బహిరంగ సభకు ఎమ్మెల్సీ కవిత గైర్హాజర్ కావడంపై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నిజామాబాద్ అభివృద్ధి కోసం నిధులు తెప్పించేందుకు సీఎం కేసీఆర్‌ను కలుస్తానని కవిత తనతో చెప్పిందన్నారు. అందుకే సభకు రాలేకపోయారన్నారు. సభలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, వి.గంగాధర్ గౌడ్, రాష్ట్ర మహిళా సహకార సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, మేయర్ దండు నీతూకిరణ్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కలెక్టర్, పోలీస్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌జేసుడు.. పారిపోవుడు



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- ఇదే గంప గోవర్ధన్ నైజం
- ప్రభుత్వ విప్‌పై షబ్బీర్ అలీ ధ్వజం

కామారెడ్డి టౌన్: నియోజకవర్గ అభివృద్ధిపై సవాల్ చేయడం.. ఆ తర్వాత పారిపోవడం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నైజమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేక్రియాల్ వద్ద నాసిరకంగా నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లపై సవాల్ చేసి తాను వెళ్లి రెండు గంటలు ఉన్నా ప్రభుత్వ విప్ రాలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఏ గ్రామంలో చర్చించడానికైనా తాను సిద్ధమేనన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి శూన్యం

పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్, బర్కత్‌పురా, భవానీ రోడ్, ఆజంపురా, గొల్లవాడ, ఇస్లాంపురాలలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ బల్దియాలో అభివృద్ధి శూన్యమన్నారు. కలెక్టరేట్ ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ వచ్చినపుడు రూ. 100 కోట్లను పట్టణానికి ఇస్తే.. ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు తమ వెంచర్లకు రోడ్లు వేసుకొని వారే అభివృద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, నాయకులు పండ్ల రాజు, అశోక్‌రెడ్డి, పుట్నాల శ్రీనివాస్ యాదవ్, గౌనె శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

‘నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి’

కామారెడ్డి క్రైం: నిర్దేశించిన లక్ష్యాలను ఈనెల 15లోగా పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎంపీడీవోలు, ఎంపీవోలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో హరితహారం, పండ్ల తోటల పెంపకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది సంపద వనాల కింద నిజాంసాగర్ మండలం అచ్చంపేట్‌లో మరో ఎకరంలో వారంలోగా మొక్కలు నాటాలన్నారు. మూడు ఎకరాల పైబడిన ప్రాంతాలలో చుట్టూ ఫెన్సింగ్ చేయించాలన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా ప్రతి పంచాయతీలో వేయి మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో వేయి ఎకరాలలో పండ్ల తోటలు పెంచాలన్నది లక్ష్యమని, ప్రభుత్వం రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను అందిస్తుందని పేర్కొన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో హరితహారం కింద 80 శాతం మొక్కలు నాటామని, 96 శాతం జియో ట్యాగింగ్ చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని తెలిపారు. పాఠశాలల్లో చింత, మునగ, వెలగ, ఉసిరిలాంటి పండ్ల మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికి తులసి, నేలఉసిరి, రణపాల, బొప్పాయి, ఇన్సులిన్ ప్లాంట్స్ లాంటి ఐదు ఔషధ మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

విద్యాలయాలలో విద్యార్థులకు పరిశుభ్రత కార్యక్రమాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.

అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా

కామారెడ్డి క్రైం: తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ ఒకటో తేదీన విడుదల చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలుపై బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీలతోపాటు వచ్చేనెల 2, 3 తేదీలలో జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీనాటికి 18 ఏళ్లు నిండే వారు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవడానికీ అవకాశం ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పెంపుపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందని, ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల ప్రతి కదలికను నిశితంగా గమనిస్తుందని పేర్కొన్నారు. మతపరమైన, వ్యక్తిగత దూషణలకు దిగవద్దని సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, ఖాసీం అలీ, జాఫర్ ఖాన్, ప్రభాకర్‌రెడ్డి, పథ్వీరాజ్, భానుప్రసాద్, దశరథ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ సర్కార్‌తోనే అభివృద్ధి’

రామారెడ్డి: సుస్థిర అభివృద్ధి, ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్ సర్కార్‌తోనే సాధ్యమవుతాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మద్దికుంటలోని బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఐమాస్ట్ లైట్లు, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దికుంటలో రూ. 1.33 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఒక్క అవకాశం ఇవ్వాలని అడుగుతున్న కాంగ్రెస్ నాయకులు గతంలో వారి పాలనలో ఎందుకు రైతుబంధు, రైతుబీమా, పెన్షన్లు అమలు చేయలేదో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ రవీందర్‌రావు, సర్పంచ్ రాంరెడ్డి, ఉప సర్పంచ్ నరేందర్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో సవిత, నాయకులు రవీందర్‌గౌడ్, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న గంప గోవర్ధన్

‘పనులను వేగవంతం చేయండి’

బాన్సువాడ: పట్టణంలో కొనసాగుతున్న ఆటోనగర్ పనులను వేగవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆటోనగర్‌లో పనులను పరిశీలించారు. పనులలో జాప్యంపై సంబంధిత ఇంజినీర్, కాంట్రాక్టర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి ఆటోనగర్‌ను బాన్సువాడలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆటోనగర్‌లో షెడ్ల ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజురయ్యాయన్నారు. 14.20 ఎకరాల్లో 210 ప్లాట్లను చేసి వృత్తిని బట్టి వాహనాల మరమ్మతుల కోసం ప్లాట్లను కేటాయిస్తామని తెలిపారు. 15 రోజుల్లో లెవలింగ్ చేసి ప్లాట్లు చేయాలని, ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలన్నారు. అనంతరం కొయ్యగుట్ట ఒడ్డెర కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులను, బీడీ వర్కర్స్ కాలనీలో ఫంక్షన్ హాల్, ప్రాథమిక పాఠశాల గదుల నిర్మాణ స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్ ఉన్నారు.



పనులపై ఆరా తీస్తున్న స్పీకర్ పోచారం



‘గృహలక్ష్మి’ కోసం బారులు

నాగిరెడ్డిపేట: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం ప్రజలు మీసేవ కేంద్రాలు, తహసీల్ కార్యాలయాలకు తరలివచ్చారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు మండలకేంద్రంలోని మీసేవకేంద్రాల వద్ద, దరఖాస్తులను సమర్పించేందుకు తహసీల్ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గురువారంతో గడువు ముగియనుంది. గడవును పొడిగించాలని నిరుపేదలు కోరుతున్నారు.

జిల్లా చరిత్రకు అక్షర రూపం

- ‘సమగ్ర స్వరూపం’ పేరుతో పుస్తకం
- 46 అంశాలతో రూపకల్పన
- నేడు కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరణ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా చరిత్రపై పుస్తకం రాబోతోంది. 46 అంశాలతో రూపొందించిన ఈ పుస్తకాన్ని గురువారం కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదిక కానుంది. జిల్లా చరిత్ర, పురాతన కట్టడాలు, భౌగోళిక స్వరూపం, సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు, భాష, విద్య, జిల్లా విశేషాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి స్వరూపంపై తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ‘కామారెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం’ పుస్తకాన్ని రూపొందించారు. జిల్లాకు చెందిన 40 మంది రచయితల కలం నుంచి వెలుబడిన 46 కథనాలను ఇందులో పొందుపరిచారు. జిల్లా భౌగోళిక, పాలనా స్వరూపం, శాసనాలు, చారిత్రక విశేషాలు, దోమకొండ సంస్థాన కవులు, కవిత్వం, ఆధునిక పద్యకవులు, కవిత్వం, శతక సాహిత్యం, గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, నాటక, బాలసాహిత్యాలు, తెలంగాణ ఉద్యమ సాహిత్యం, ఉర్దూ సాహిత్యం, పత్రికలు–ప్రసార మాధ్యమాలు, భాషా విశేషాలు, మాతృభాషపై మరాఠీ ప్రభావం, జిల్లాలో వాడుక పదాలు, సాహిత్య సంస్థలు, పరిశోధకులు, పండితులు –అవధానులు, ఆధ్యాత్మిక వేత్తలు –ప్రవచన కర్తలు, యక్షగాన నటులు –దర్శకులు, తెలుగు సినీ, టీవీ రంగాల్లో జిల్లావాసులు, దేవాలయాలు, పర్యాటక స్థలాలు, గడీలు, జిల్లా గిరిజన సంస్కృతి సాహిత్యం, పౌరసమాజం –జీవన వైవిధ్యం, జానపద కళలు, సంగీత, నృత్య చిత్రలేఖన కళలు, క్రీడారంగం, జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు, వృత్తి –సాంకేతిక విద్య, తెలంగాణ ఉద్యమం, రాజకీయ రంగం, విద్యారంగం, తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ –చారిత్రక ప్రస్థానం, ప్రాచ్య విద్యా పరిషత్తు –భాషా సాహిత్య సేవ, వైద్య ఆరోగ్య రంగం, జిల్లా ఆర్థిక స్వరూపం, జిల్లాలో సాగునీటి వనరులు, జిల్లాలో బీడీ కార్మికులు, జిల్లా అడవులు అంశాలపై సమగ్ర సమాచారాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ పుస్తకాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించనున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అదనపు కలెక్టర్ కే.చంద్రమోహన్, డీఈవో కే.రాజు, దాశరథి సాహితీ పురస్కార గ్రహీత అయాచితం నటేశ్వర శర్మ, కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, అధ్యాపకులు వి.శంకర్, వీఆర్ శర్మ, కే.వేణుగోపాల్, సూరారం శంకర్, సునీత, దత్తయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొననున్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోసం ధర్నా



బాన్సువాడ: కేజీబీవీలో పని చేస్తోన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తపస్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో ధర్నా చేపట్టనున్నట్లు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్ అన్నారు. బుధవారం కొత్తాబాది కేజీబీవీ పాఠశాల వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ధర్నాకు తరలిరావాలన్నారు.

'చలో కోరుట్ల' సభను విజయవంతం చేయాలి



రాజంపేట/మద్నూర్: జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈ నెల 13న జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు సిరిగాద లక్ష్మీ నర్సింలు పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట, మద్నూర్ మండల కేంద్రాల్లో పద్మశాలి రాజకీయ యుద్ధభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పద్మశాలీలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. చిట్యాలకు చెందిన కోరే అశోక్కు భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన కృపతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. అశోక్ ఉపాధి నిమిత్తం నెల రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. వెళ్లేటప్పుడు అతని భార్య, కుమార్తెను కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలోని తన మేనత్త ఇంటి వద్ద ఉంచి వెళ్లాడు. ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లిన కృప తిరిగి రాలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అశోక్ దేవునిపల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

మా భూములు మాకే కావాలి

- ఎక్కపల్లి గ్రామ శివారులో ఇతరులకు పంపిణీ చేశారని గ్రామస్తుల ఆగ్రహం
- అటవీ భూములు ఎవరికీ చెందకుండా చూస్తామని గ్రామస్తులకు ఇదివరకే హామీ ఇచ్చిన అధికారులు



అటవీ భూములను నరికిన గ్రామస్తులు



ఎక్కపల్లి శివారు అటవీ ప్రాంతంలో గ్రామస్తులు నరికివేసిన చెట్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎక్కపల్లి గ్రామ బీట్ కంపార్టుమెంట్ నంబర్- 691 శెట్పల్లిసంగారెడ్డి బ్లాకులో అటవీ భూమి చుట్టూ సీసీటీ తీయించి అటవీ శాఖ ఆధీనంలోకి తీసుకుంటామని గ్రామస్తులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అటవీ శాఖ అధికారులు విస్మరించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు .. ఇతర గ్రామాలకు చెందిన వారికి పట్టాలు ఇచ్చారని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో తమ శివారులో ఉన్న భూములు తమకే చెందాలని మూడు రోజులుగా అటవీ ప్రాంతంలో పొదలను తొలగిస్తున్నారు. ఇటీవల ఎక్కపల్లి గ్రామ శివారులోని అటవీ భూములను పోడు భూములుగా మార్చి గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని గ్రామస్తులు ఆరోపించారు. ఆ అటవీ భూమి విషయమై గత ఏడాది నవంబర్ 11న గిరిజనులకు, ఎక్కపల్లి, బొల్లారం గ్రామస్తులకు మధ్య వివాదంగా మారింది. దాంతో అటవీ శాఖ అధికారులు ఆ భూమిని ఎవ్వరికి ఇవ్వకుండా కందకాలు తవ్వించి హద్దులు ఏర్పాటు చేసి అటవీ భూమిని కాపాడుతామని ఎక్కపల్లి గ్రామస్తులకు అధికారులు రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. నెల రోజుల క్రితం పోడు పట్టాలు ఇచ్చారని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా గ్రామాల్లో భూమిలేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, మా శివారులోని భూములు మాకే చెందాలని మూడు రోజులుగా ఎక్కపల్లికి చెందిన నిరుపేదలు అటవీ ప్రాంతానికి తరలివెళ్లి చెట్లను తొలగించారు. సుమారు ముప్పై ఎకరాల్లో పొదలను తొలగించారు. తమ గ్రామాల్లో భూమిలేని వారికి భూమి పంచాలని డిమాండు చేశారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అటవీ భూములను నరకవద్దని సర్ది చెప్పినా ఫలితం లేకుండా పోయింది.

మంచి పాలన అందించడమే లక్ష్యం



పిట్లంలో నూతన అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధే, నాయకులు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మంచి పాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 108, 104 అంబులెన్స్ వాహనాలను ప్రారంభించారు.

తిమ్మనగర్, చిల్లర్గి గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్దండ, ధర్మారంలో గ్రామాల్లో నూతనంగా నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను, గొద్మెగాం, చిన్నకొడప్‌గల్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో జీపీ భవనాలను ప్రారంభించారు. అంతకు ముందు నూతన ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మనగర్, గౌరారం గ్రామాలలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడి



వరి సాగును పరిశీలిస్తున్న అధికారి భాగ్యలక్ష్మి

బీబీపేట: డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి పంట దిగుబడి బాగా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తున్న పంటను పరిశీలించారు. అలాగే నేరుగా విత్తే వరిలో ఎక్కువగా కలుపు సమస్య ఉంటుందని, దాని నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం మందును ఎకరానికి 400 గ్రాములు లేదా క్లోరాంతనిలిప్రోల్ 60 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేస్తే మొగి పురుగును నివారించవచ్చని సూచించారు. ఏడీఏ అపర్ణ, ఏవో పవన్‌కుమార్, ఏఈవో రాఘవేంద్ర పాల్గొన్నారు.

కాయితీ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



కామారెడ్డి టౌన్: కాయితీ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై సీఎం కేసీఆర్ స్పందించాలని కాయితీ లంబాడ రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. 1977లో అప్పటి జీవో- 2,4,5 ప్రకారం తాము ఎస్టీ జాబితాలోనే ఉన్నామని గుర్తు చేశారు. తర్వాత తమకు అన్యాయం జరిగిందన్నారు. నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇస్తూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

ముస్తఫా అర్షత్‌కు పీహెచ్‌డీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్ ముస్తఫా అర్షత్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ ఉర్దూ ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా పర్యవేక్షణలో 'ప్రొఫెసర్ మహమ్మద్ అలీ జహీసియాథ - ఈ - ముహకిక్' అనే అంశంపై ముస్తఫా పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. బుధవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన వైవావోస్‌కు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి) ప్రొఫెసర్ నిస్సార్ హైమద్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ పి కనకయ్య, బీవోస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఖవి పాల్గొన్నారు.

డైరీల పంపిణీ

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ మూల్యాంకన డైరీలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పంపిణీ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రస్తుత వానాకాల పంటలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు పంటల్లో చీడపీడలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కేవీకే ద్వారా అందిస్తున్న వ్యవసాయ సేవలను వినియోగించుకోవాలని, వ్యవసాయ మూల్యాంకనంలో ఉన్న సమాచారాన్ని ఏఈవోలు అందించాలని డీఏవో సూచించారు.

ఇంటింటికి ఇంకుడు గుంతలు

బిచ్కుంద(జుక్కల్): ప్రతి ఒక్కరూ ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీవో మహిబూబ్ అన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తుందన్నారు. వెడల్పు, పొడవు 12 అడుగులతో నిర్మించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

పార్ట్‌టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు

కామారెడ్డి రూరల్: పార్ట్‌టైం స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని పార్ట్‌టైం స్వీపర్లు బుధవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు కనీస వేతనం రూ.27 వేలు చెల్లించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తమను ప్రభుత్వం ఇప్పటి వరకు సంప్రదించకపోవడం శోచనీయమన్నారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో వారి వారసులను నియమించాలన్నారు. విద్యార్హత ఉన్నవారిని అటెండర్లుగా నియమించాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గంప హామీ ఇచ్చారు. నాయకులు బాలయ్య, శివ్వంది సత్యం, శివలింగం, గంగయ్య, సిద్దిరాములు, మునీరోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు కట్ట వద్ద దోభీ ఘాట్ల నిర్మాణం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్ట వద్ద దోబీ ఘాట్ల నిర్మాణం కోసం మున్సిపల్‌లో పాలకవర్గం తీర్మానం చేసినట్లు మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్ బుధవారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అధ్యక్షతన పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రూ.13 లక్షలతో రాశివనంలో వన మూలికల చెట్ల పెంపకం, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వేతనాల పెంపు తదితర వాటిని తీర్మానం చేసినట్లు వివరించారు. వైస్ చైర్మన్ సుజాత, కౌన్సిలర్లు శ్రీకాంత్, రాము, సాయిలు, శ్రీనివాస్,భూదేవి,మహేశ్వరి,విజయలక్ష్మి, బాలమణి, నీలకంఠం, జీనత్ సుల్తానా తదితరులున్నారు.

పరీక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతున్న ఏఎన్ఎంలు

కామారెడ్డి టౌన్: ఎటువంటి పరీక్షలు లేకుండా క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అన్ని విధాలా సేవలందిస్తున్నామన్నారు. తమకు ప్రభుత్వం అన్యాయం చేస్తూ తమను రెగ్యూలర్ చేయకుండా పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థనే రద్దు చేస్తానన్న సీఎం తక్షణమే తమను రెగ్యూలర్ చేసి మిగతా పోస్టులకు పరీక్ష నిర్వహించాలని కోరారు.

ఆలయ ఉద్యోగులకు బయోమెట్రిక్

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరును త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో అర్చకులు, ఉద్యోగులు సమయ పాలన పాటించక పోవటంతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. అందుకే ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో మాదిరిగా భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాల్లో బయోమెట్రిక్ హాజరు మిషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుళ్లకు వచ్చే ఆదాయాన్ని తిరిగి ఆలయాల పునర్నిర్మాణాలకే కేటాయిస్తున్నట్లు సుప్రియ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఆదాయం వచ్చే ఆలయాలు 50 వరకు ఉంటాయని, వీటిపై వచ్చే ఆదాయాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్మించే గుళ్లకు కేటాయిస్తామన్నారు.

ఆలయ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు. సదాశివనగర్‌లో విశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన దాదాపు 300 ఎకరాల భూమి కబ్జాలో ఉందని చెప్పారు. కబ్జాలకు పాల్పడిన వారిపై కేసు ఫైల్ చేస్తున్నామని తెలిపారు. నిజామాబాద్‌లోని నీలకంఠేశ్వర ఆలయానికి సంబంధించిన స్థలాల్లో ఎనిమిది కట్టడాలు, జెండా బాలాజీ మందిరం స్థలాల్లో ఆరు నిర్మాణాలు ఉన్నాయని, వీటిపై కేసు నడుస్తోందని వివరించారు.

అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛన్ ఇస్తాం



మాచాపూర్‌లో కరపత్రాలను అందిస్తున్న సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేయూత పథకం ద్వారా రూ.4 వేల పెన్షన్ అందిస్తామని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. బుధవారం మాచాపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రూ.లక్షల రుణమాఫీ కూడా చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

డబ్బులు డబుల్ వస్తాయని టోకరా

భిక్కనూరు: డబ్బులు పంపితే డబుల్ వస్తాయని చెప్పి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. భిక్కనూరు మండలం బస్వాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని సోషల్ మీడియాలో బినాన్స్ యాప్ ఆడ్ చూసింది. అందులో చెప్పిన నంబర్‌కు డబ్బు పంపితే డబుల్ వస్తాయని ఉండటంతో నమ్మి మొదట రూ.పది వేలు జమ చేసింది. అనంతరం మరో రూ.35 వేలు వారు చెప్పిన అకౌంట్‌లో వేసింది. తీరా డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది.

కాకతీయ కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరగడంతో కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు పెంచారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 9028 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 135 క్యూసెక్కులు, అలీసాగర్ ద్వారా 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090(84.81 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బాల్కొండ: బాల్కొండలోని తెలంగాణ ఫంక్షన్ హాల్ వెనుక గల మామిడితోటలో ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన ఆకుల రాజు(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. పెర్కిట్ బస్టాండ్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహించే రాజు మామిడి తోటలోని గుడిసెలో శవమై కనిపించాడు. తోటలోకి ఉదయం వెళ్లిన యజమాని గమనించి వెంటనే స్థానికులకు తెలుపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. బాల్కొండ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కనుబొమ్మలపై గాయాలు ఉన్నాయి. దీంతో భార్య లావణ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజాంసాగర్ కాలువలో 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉందన్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంట్, డబ్బుల చొక్కా ఉన్నట్లు ఆయన తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగలు పడ్డారు. కాలనీకి చెందిన దుంప భిక్షపతి కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగలు సామన్లను చిందరవందర చేశారు. 8 గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు. కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు, చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. అదే కాలనీలోని రవి అనే వ్యక్తి ఇంట్లో కూడా చోరీ చేశారు. రూ. 6 వేల నగదు అపహరించారు. బుధవారం పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కర్రోల్ల రూప తన పిల్లలతో సహా అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన కర్రోల్ల బాబుకు భార్య రూపతోపాటు కొడుకు అశ్విన్(10), కూతురు అక్షయ(8) ఉన్నారు. ఈ నెల 7న ఇంట్లో ఉన్న రూ.27 వేలు తీసుకొని పిల్లలకు బుక్స్ తెస్తానని చెప్పి రూప గోపాల్‌పేటకు వెళ్లింది. రాత్రయినా వారు తిరిగి రాకపోవడంతో బాబు పలుచోట్ల గాలించాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దూపల్లిలో వివాహిత..

రెంజల్: మండలంలోని దూపల్లికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి లస్మయ్య ఫిర్యాదు చేశాడని ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. యువతికి ఏడాది క్రితం సదాశివనగర్‌కు చెందిన రవితో అయింది.

ఇటీవల తమ తల్లిగారింటికి వచ్చిన యువతి సదాశివనగర్‌కు బయలు దేరింది. ఆమె ఇంటికి రాలేదని అల్లుడు ఫోన్ చేయడంతో లస్మయ్య పలుచోట్ల గాలించాడు. అయినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెచ్చిపోయిన దొంగలు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలో దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి అన్నారం, తొండాకూర్ గ్రామాల్లో చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా పక్కా ప్లాన్‌తో దొంగతనాలు చేశారు. అన్నారంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన కమ్మరి లింబాద్రికి చెందిన టీవీఎస్ స్పోర్ట్స్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. అదే విధంగా మద్యం దుకాణం షట్టర్‌ను ధ్వంసం చేసి సుమారు రూ.50వేలు విలువ చేసే మద్యం సీసాలను, రూ.4వేల వరకు నగదును అపహరించారు. బీమన్న గుడిలో గంటలను ఎత్తుకెళ్లారు. గ్రామంలో ఒకరి ఇంటి ముందు కులాయిలను ధ్వసం చేసిన ఆనవాళ్లు కనిపించాయి. కాగా గ్రామంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా అందులో బుధవారం ఉదయం 5 గంటల నుంచి మాత్రమే రికార్డింగ్ అయిన పుటేజీలు ఉన్నాయి. దీంతో దొంగలు బయటి నుంచి వచ్చారా, లేదా తెలిసిన వ్యక్తుల పనేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా అన్నారంలో దొంగతనం జరిగిన సమయానికే తొండాకూర్‌లో కూడా బద్దెన్న అనే వ్యక్తికి సంబంధించిన ప్యాషన్ ప్రో బైక్‌కు చోరీ చేశారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన సర్పంచ్

రుద్రూర్: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తిని వదిలేయాలని కోటగిరి మండలం సుద్దులం సర్పంచ్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. వివరాలు.. ఆదివారం రాత్రి రుద్రూర్ ఎస్సై నీరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. కోటగిరికి చెందిన రవికిరణ్ మద్యం తాగి బైక్ నడపగా పోలీసులు ఆపి టెస్ట్ చేసి కేసు రాస్తున్నారు. ఇదే సమయంలో వచ్చిన సుద్దులం సర్పంచ్ సాయిలు డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వ్యక్తిని వదిలేయాలని పోలీసులతో వాగ్వాదం చేశాడు. ఫుల్‌గా తాగి ఉన్నాడని కేసు రాసి వదిలేస్తామని పోలీసులు చెబుతున్నా వినకుండా ఎస్సైని నెట్టివేస్తూ దురుసుగా ప్రవర్తించాడు. 'నేను అధికార పార్టీ సర్పంచ్‌ను.. నా మాట వినరా' అంటూ రోడ్డుపై హంగామా చేశాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరలైంది.

కుక్కల దాడిలో గేదె, దూడ మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో కుక్కల దాడిలో బుధవారం గేదె, దూడ మృతి చెందాయి. సర్పంచ్ గంగమణి నాగరాజు తెలిపిన వివరాలు.. గుంజల సాయిలుకు చెందిన గేదెను ఇంటిముందు కట్టేశాడు. బుధవారం తెల్లవారుజామున గేదె ఈనింది. అదే సమయంలో కుక్కలు దాడి చేశాయి. ఈ దాడితో అప్పుడే పుట్టిన దూడతో పాటు గేదె కూడా మరణించింది.